క్లుప్తంగా

తిరునక్షత్ర మహోత్సవాలకు ఆహ్వానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 12 నుంచి 16వ తేదీ వరకు సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో నిర్వహించే తిరునక్షత్ర మహోత్సవాలకు శనివారం ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆశ్రమ కార్యాలయ నిర్వాహకులు రఘుస్వామి స్వామివారి ముఖ్య శిష్యులు వేద పాఠశాల అధ్యాపకులు మధుగురుస్వామి, మాధవాచారి స్వామి గౌతంరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ తిరునక్షత్ర మహోత్సవాలకు తాను తప్పక హాజరవుతానన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను గౌతంరెడ్డికి అందజేశారు.

దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో రాజీవ్ గృహకల్ప కాలనీ హెచ్ బ్లాక్‌లో శ్రీస్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మూడో ఏడాది నిర్వహిస్తున్న శ్రీకనకదుర్గమ్మ వారి దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల బ్రోచర్‌ను ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఆవిష్కరించారు. ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ఆర్‌ఎస్ నాయుడు కోరారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి జరగనున్న దసరా మహోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాకు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ఆహ్వాన పత్రికను అందజేశారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయానికి శనివారం విచ్చేసిన ఆయన ఎమ్మెల్సీ రుహుల్లాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రుహుల్లా మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు అమ్మవారి ఆలయాన్ని చాలా సుందరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా మరింత జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్సీ రుహుల్లా దుర్గగుడి చైర్మన్‌కు సూచించారు.

మహాలయ అమావాస్య పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం మహాలయ అమావాస్య పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి బూడిద గుమ్మడికాయలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పండుగల విశిష్టత తెలుసుకోవాలి



గుణదల(విజయవాడతూర్పు): భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో పండుగలకు అత్యంత ప్రాధాన్యత ఉందని ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సిటిజన్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మి తెలిపారు. గురునానక్ నగర్‌లోని సిటిజన్స్ పబ్లిక్ స్కూల్‌లో దసరా సంబరాలు శనివారం నిర్వహించారు. జగన్మాతగా కొలువుదీరిన దుర్గాదేవిని తొమ్మిది రోజుల పాటు పలు అవతారాల్లో పూజలు చేస్తారన్నారు. ఈ దసరా పండుగ అందరి జీవితాల్లో భక్తి భావాలతో పాటు సుఖ సంతోషాలను నింపాలని కాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిషాసుర మర్దని అవతారంలో త్రిశూలధారిణిగా అమ్మవారిని ప్రతిబింబించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు
- నగరంలో ఉత్సవ శోభ



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సిద్ధం చేసిన ఉత్సవ విగ్రహాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలను, పలు మండపాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాల్లో అమ్మవార్లు దర్శనమివ్వనున్నారు. దీంతో నగరంలో ఉత్సవ శోభ నెలకొంది. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు చేయటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన 22వ శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయం, వీధులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ప్రతి రోజు అమ్మవారికి విశేష పూజలు అర్చనలు, హోమాలు, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు.

ముత్యాలంపాడులో..

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన దసరా ఉత్సవాలు చేయటానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహ



మధురానగర్‌లో ఏర్పాట్లు చేస్తున్న యువత



రామలింగేశ్వరనగర్‌లో విద్యుత్ వెలుగులు

స్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు చెప్పారు. బావాజీ పేట నాలుగో లైనులో శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవాలయం పాలక మండలి సభ్యురాలు బచ్చుమాధవీ మురళీకృష్ణ ఆధ్వర్యాన దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా సెట్టింగ్ వేశారు.

30వ డివిజన్‌లో...

30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్‌లో దేవుని మండపం వద్ద, దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక మధురానగర్ మెయిన్‌రోడ్డులో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన పూర్తయ్యాయి. అమ్మ వారికి విశేష అలంకారాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.





దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబైంది. ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ప్రతి గడపకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 231వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, నగర పాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి రామలింగేశ్వరపేటలో ఆయన విస్తృతంగా పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సెంట్రల్ నియోజకవర్గాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలోకి తీసుకు వచ్చామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గ పరిధిలో ముగిసిన వెంటనే.. సెంట్రల్ ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.

సానుభూతి కోసం టీడీపీ డ్రామాలు

చంద్రబాబు ఆరోగ్యంపై తెలుగుదేశం డ్రామాలాడుతోందని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. జైల్లో విశ్రాంతి తీసుకుంటూ బాబు కేజీ బరువు పెరిగితే.. 5 కేజీలు తగ్గినట్లు సింపథీ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పులను అధికారులు వెలికితీయడంతో సీఐడీ అధికారులు ప్రొసీజర్ ప్రకారం ఆయనను అరెస్టు చేశారని చెప్పారు. రూ.120 కోట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని అనే షాపూర్జీ పల్లోంజి డైరెక్టర్ ద్వారా తన పీఏ డబ్బులు నేరుగా లంచంగా తీసుకోవడంతో.. హైదరాబాద్‌లో ఉన్న ఇన్ కమ్ ట్యాక్స్ కేంద్ర కార్యాలయం ఆయనకు నోటీసులివ్వడం జరిగిందని గుర్తుచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతి నిర్మాణాలు, ఫైబర్ నెట్ టెండర్లపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఆటోనగర్(విజయవాడతూర్పు): రైతులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకారమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రధాన ధ్యేయమన్నారు. 11వ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో రూ.90 లక్షలతో నిర్మించిన రైతుబజారును శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో యువకులు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇక్కడ నిర్మించిన రైతుబజారు రాష్ట్రంలో 107వదని, ఇందులో 73 షాపులు ఉన్నాయని చెప్పారు. 7 మండలాల నుంచి ఇక్కడకు రైతులు నాణ్యమైన కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తారన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. తూర్పు నియోజకవర్గంలో సుమారు 90 శాతానికి పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రామవరప్పాడు, కరెన్సీనగర్‌తో పాటు పలు కాలనీ ప్రజలకు ఈ రైతు బజారు అందుబాటులో ఉంటుందన్నారు. నగర అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తూర్పులో అభివృద్ధి జరిగిందన్నారు. సకల సౌకర్యాలతో నిర్మించినట్టు చెప్పారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినియోగదారులకు తాగునీటి సౌకర్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే, సీఈఓ నందకిషోర్, జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

పౌష్టికాహారం పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పౌష్టికాహారం, వ్యాయామం, ఏఆర్‌టీ చికిత్స ద్వారా హెచ్‌ఐవీ సోకిన వారు తమ జీవన ప్రమాణాన్ని పెంపొందించుకోవచ్చునని ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమ్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో శనివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకినవారు ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సేవలనువినియోగించుకుని ఆరోగ్యకర జీవనం సాగించవచ్చునని తెలిపారు. హెచ్‌ఐవీ బాధిత, నిరుపేద చిన్నారులకు క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ.. దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగాట్రస్ట్ సభ్యులు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవలు అందించాలని సూచించారు. ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ కె.వరప్రసాద్, ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, శ్రీనివాసరావు, ఫణిశేఖర్, కె.రాము, రహీమా, షేక్ నాగుల్ మీరా,బి.రాములు,నాగూర్‌బీ పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోరాటాల ద్వారానే ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో శనివారం ఉభయ రాష్ట్రాల మాలమహానాడు కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలను విభజించాలని కుట్ర జరుగుతోందన్నారు. మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు న్యాయ పోరాటం చేసి వర్గీకరణను అడ్డుకున్నారన్నారు. సుప్రీంకోర్టు కొట్టివేసిన వర్గీకరణ అంశాన్ని మరలా తెరపైకి తెస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ మద్దతుతో కొందరు వర్గీకరణ చేయాలని పట్టుబడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పీవీ రావు స్ఫూర్తితో మరోసారి పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీలను విభజించవద్దన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తామన్నారు. మాల మహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

వేగాలో దసరా, దీపావళి ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని బృందావనకాలనీ నందమూరిరోడ్డులోని వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు ఆ షోరూమ్ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆఫర్ల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో మమ్మల్ని ఆదరిస్తున్న ఖాతాదారులకు పండుగల సందర్భంగా ప్రత్యేక రాయితీలు కల్పించడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 15 నుంచి నవంబర్ 13వ తేదీ వరకు ఆఫర్లు ప్రవేశపెట్టామని తెలిపారు. వజ్రాభరణాలపై క్యారట్‌కు రూ.55,999లు చార్జి చేస్తున్నామన్నారు. పోల్కీ ఆభరణాలపై ఎలాంటి మేకింగ్ చార్జీలు, తరుగు లేవని తెలిపారు. బంగారు ఆభరణాలపై ఎలాంటి మేకింగ్ చార్జీలను ఈ ఆఫర్ కాలంలో వసూలు చేయమని వారు పేర్కొన్నారు. తమ షోరూమ్‌లో ఆధునిక ఫ్యాషన్ ప్రపంచానికి సరితూగే ఎన్నో రకాల సరికొత్త ఆభరణాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకుని దసరా, దీపావళి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న షోరూమ్ అధినేతలు వనమా నవీన్, సుధాకర్ తదితరులు

అలుపెరగని బాలల హక్కుల నేత టీవీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు(టీవీ) ఆపదలో ఉన్న బాలలకు అండగా ఉండి, బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడ్డారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ నిర్వాహకుడు బీఎస్ కోటేశ్వరరావు తెలిపారు. హనుమాన్‌పేటలోని తానా భవన్‌లో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ 10వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. తొలుత టీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎంతో ముందు చూపుతో 25 సంవత్సరాల క్రితమే బాలల హక్కుల పరిరక్షణకు అందరినీ ఒకే వేదిక మీద పైకి తెచ్చిన గొప్ప వ్యక్తి టీవీ అని కొనియాడారు. టీవీ ఆశయాలను ముందుకు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్ చీఫ్ కోఆర్డినేటర్ కె.చంద్ర, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్, ప్రజా గాయకుడు ఆర్.పిచ్చయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు



టీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి పిలుపునిచ్చారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత వైద్య పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ.. ప్రతి ఇంటా ఆరోగ్యం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజు మాట్లాడుతూ.. ప్రతి గడపకు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొంగితల సుధాకర్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీపతి, డాక్టర్ అంజు తదితరులు

కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



విజయకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని సాహితీవేత్త గంటేడ గౌరీనాయుడు అన్నారు. ఎక్స్‌రే సాహిత్య మాసపత్రిక ఏలూరు రోడ్డు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఎక్స్‌రే 2020 అవార్డులు బహూకరించారు. కవి తిక్కన సోమయాజి 84 జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించింది. న్యాయనిర్ణేతగా గౌరీనాయుడు వ్యవహరించారు. కవి సోదరులు పువ్వాడ శివరామ విఠల్, వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా కవితల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి కవితల పోటీ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ పీవీ దుర్గారాణి, ఎక్స్‌రే సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, ఉపాధ్యక్షుడు కందికొండ రవికిరణ్, కార్యదర్శి సీహెచ్‌వీ సుబ్బయ్య నిర్వహించారు. 2020 సంవత్సరానికి ఎక్స్‌రే ప్రధాన పురస్కారాన్ని తిరుపతికి చెందిన నల్లు రమేష్, ఉత్తమ కవితా పురస్కారాలను సాంబమూర్తి అండ, పొత్తూరి సీతారామారావు, కొంపెల్ల కామేశ్వరరావు, అవ్వారు శ్రీధర్‌బాబు, తిరువాయపాటి రాజగోపాల్, కత్తుల కిషోర్ కుమార్, బి.కళాగోపాల్, తూపిలి రవీంద్రబాబు, పద్మసుధామణికి ఉత్తమ కవితా పురస్కారాలను అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ రామలింగేశ్వరపేటలో ఓ ప్రైవేట్ స్కూల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి ఆయన పాల్గొన్నారు. బాల్యం నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నగరం పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని.. సెంట్రల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామన్నారు. ఇప్పటికే కండ్రిక జంక్షన్ వద్ద సిగ్నలింగ్ బ్లింకర్లను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఉడాకాలనీ, నందమూరి నగర్, న్యూ ఆర్.ఆర్.పేట, గవర్నమెంట్ ప్రెస్ సెంటర్ సహా పలు సమస్యాత్మక కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం రెడ్డి బత్తుల గోవింద ఆశ్రయరెడ్డి, శివకృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యుల సహకారంతో 400 మందికి అన్నప్రసాదాన్ని అందించారు. కల్యాణ మండపం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కావడంతో ఉత్సవాలు నిర్వహించడానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సామాన్య పౌరులకు దూరమవుతున్న విద్య



కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరిగే కొద్దీ సామాన్య పౌరులకు విద్య దూరమవుతుందని, విద్యా సంస్థల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.చిన్నయసూరి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజావికాస వేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యారంగం ప్రమాణాలపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నయసూరి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం చాలా విస్తృతమైందని, ఆర్థిక సంస్కరణల తర్వాత విద్యా రంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యలో బోధన, పరిశోధన, విస్తరణ మూడు లక్ష్యాలు కీలకంగా ఉన్నాయన్నారు. డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో ప్రమాణాలు కాపాడాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విద్య కార్పొరేట్ విద్యగా మారి రెండే రెండు బడా యాజమాన్యాల చేతిలో బందీ అయిందని, క్రమంగా ఈ శక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రభుత్వ విధానాల్ని శాసించే స్థాయికి చేరుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్, రమేష్ పట్నాయక్, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, విద్య సంస్కరణోద్యమ కార్యకర్త డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎం.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలు విజయవంతానికి పిలుపు

విజయవాడకల్చరల్: నగరంలో నిర్వహించే దసరా మహోత్సవాల్లో సాంస్కృతిక కళా సంస్థలు తమ ప్రదర్శనల ద్వారా విజయవంతం చేయడానికి కృషి చేయాలని సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సినీ స్వరాంజలి కార్యక్రమాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమాలను జేపీ అండ్ రాజ్ సంస్థ నిర్వహించింది. నగరంలో తొలిసారిగా వివిధ సంస్థల సహకారంతో 11 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు, రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్, వివిధ సంస్థల ప్రతినిధులు బీవీ వీరభద్రరావు, కొమ్మినేని రత్నకుమారి పాల్గొన్నారు. ఆదిరాల జయప్రభ ఆధ్వర్యంలో చిత్ర గీతాలను ఆలపించారు. గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

